# మూడు మేడలూ, నాలుగు కార్లూ

ఆరడుగుల పొడవుండి, అమెరికన్ బుష్షర్టు వేసుకుని–ట్వీడు ఫేంటు జేబుల్లో చేతులు పెట్టుకుని గంభీరంగా నిలబడ్డాడేగాని దానికి తగిన ధైర్యం మా చిన్నబావలో ఏదీ? నుదుటను పట్టిన చెమట బిందువుల్ని తుడుచుకుంటూ—మా మాటలు వినీ విననట్టు అలా అల్లంతదూరంలో పచార్లు చేయడం మొదలెట్టేడు.

'అయితే రంగమ్మత్తా, నాకు తెలీక అడుగుతానూ, వీడికిప్పట్లో పెళ్ళి చేయ్యదల్చుకోలేదా ఏమిటి? వాడు నాకు పెళ్ళివద్దు మొర్రో అన్నన్నాళ్లూ నువ్వు తెగతొందరపడ్డావు—వాడిప్పుడు కావాలంటూంటే ఆలస్యం చేస్తున్నావు. చూడు అరమోడ్పు కన్నులతో ఎలా చూస్తున్నాడో!' అన్నాను నేను చిన్నబావను చూపిస్తూ. మా మేనత్త నవ్వింది. వాడు కాస్త సిగ్గుపడి—

'ఏమయినా పెళ్ళి అయాక వీడికి అలంకారాలు ఎక్కువయ్యాయి!' అన్నాడు.

'అదేం మాట, అనుభవంలేని మాట? పెళ్ళికాకముందు అందరం అరగంట కోటా కొట్టినవాళ్ళమే. అదీ అయిన తరువాత అవతల దాని అలంకారాలే చూస్తామా, మనవే చూసుకుంటామా? పెళ్ళి కాకముందు మా మావయ్య ఎలా ఉండేవాడు? టైరుజోడూ, నల్లులు విశ్రమించే ఆనాటి నల్లకోటూ — యిప్పు డెలాఉన్నాడు రంగమ్మత్తా?'

రంగమ్మత్త నుదుటి చివర చెరిగిపోని ఫేసుపౌడరూ, తలకి రాసుకున్న రంగూ యీ మాటల్ని ఒప్పుకోక తప్పలేదు.

'అయినా మునపటిలా కాదు, వీడికి హాస్యా లెక్కువై పోయాయమ్మా!' అంది ఆవిడ.

'దానికేంగాని, పిఠాపురం సంబంధం ఏమైనట్టూ ? పిల్ల నచ్చినట్టేనా ?' నేను ఈ సంగతులు రంగమ్మత్తనే అడుగుతాను. మా మావయ్య నడగను. ఆయనకి ఆ యింట్లో పలుకుబడి తక్కువ. పోనీ చిన్నబావనే అడుగుదామంటే — వాడిన్నాళ్ళూ నాకు పెళ్ళి వద్దని మంచు ముక్కైపోయి, ఏ వేడి తగిలిందో ఓనాటి శుభముహూర్తాన నీరై ఊరుకుని పెళ్ళో పెళ్ళో అని కొన్నాళ్ళు చాటుగా, దానివలనా తగు ఫలితంలేక — బహిరంగంగానూ పలవరిస్తూ వచ్చాడు. ఈ పరిస్థితుల్లో వాణ్ణి నేను 'పెళ్ళికూతురు చిన్నది' ఎలా ఉంది అని అడుగుతే వచ్చే జవాబు నాకు తెలుసు. ముక్కు ఉందా, లేదా అన్నట్టు ఉన్నా వాడి కది చంపకపుష్పంలా కనపడి తీరుతుంది! ఎంత గజమధ్య అయినా వాడి కది సింహ కిశోరిలా గోచరిస్తుంది! మొగాడు వేషమేసుకున్నట్టుఉన్నా ఆ పరిస్థితుల్లో వాడి కది మూర్తీభవించిన యవ్వనస్వరూపంగా తట్టితీరుతుంది! అందుకని మా రంగమ్మత్తనడుగుతేనే 'రైట్ ఇన్ఫర్మేషన్' లభిస్తుంది!— ఆవిడ పెదవి విరిచేసింది.

'తనూ ఓ మనిషే, తవుడూ ఓ రొట్టే ?' అన్నట్టు అదీ ఓ సంబంధమే ? కారైనా పట్టని సందులో పావురం గూడులాంటి యిల్లూ...' మా రంగమ్మత్తలాంటి వాళ్ళతో పావుగంట మాటాడితే ఎప్పటికప్పుడు — మనం ఎప్పుడూ వినని తెలుగు ఫ్రేజులు దొరుకుతాయి. వాటిని ఎప్పటికప్పుడు మనస్సులో నోట్ చెయ్యడం నా కలవాటు.

'అలాగా, చెప్పు చెప్పు...' అని అందించాను నేను.

'ముఖ్యంగా నేను గమనించిన విషయం ఒక్కటుంది. తెలుపు రంగుమీద ఆకుపచ్చ గళ్ళ పుల్లంపేటచీర, నాకు బాగా జ్ఞాపకం. పెళ్ళికూతుర్ని తీసుకొచ్చి చూపించారా, అప్పుడు ఆ అమ్మాయికి యింతోటి ఘనాపాటి చీరా ఆ చీరే కట్టబెట్టేరు. పోనీ అంతమటుకు బాగానే ఉంది. మరో గదీకి ఆ అమ్మాయిని తీసుకెళ్ళిపోయారు. ఇంతట్లో ఆ అమ్మాయి

అక్కటా, అంతవరకూ నిద్దరోతోందిటా అక్కడకు వచ్చింది. ఏం చెప్పను ? అదే చీరా, అదే పమిటదగ్గర మగూను ! పెళ్ళికూతురు వదినగారు మమ్మల్ని స్టేషనుకొచ్చి దిగబెట్టింది. ఆశ్చర్యం, ఆవిడ కట్టు కున్నదీ అదే చీర ! ఇంత కటిక దరిద్రులకి చూసి చూసి ఎలా ఇవ్వగలం రామకృష్ణా ?' నేను గట్టిగా నవ్వేను. మా చిన్నబావ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

'చూడు బాబూ, మీ అమ్మతో నే చెప్పమన్నానని చెప్పు. అన్నిటికన్నా దేనికైనా ధనం ముఖ్యం. ఆవిడ ఎరికిని ఎవరైనాసరే – పదివేలు యిస్తే చాలు, పిల్ల ఎలాఉన్నా సరే, రైటు చేసెయ్యమని చెప్పు.'

అలాగే అన్నాను నేను.

* * * *

హఠాత్తుగా శుభలేఖ వస్తే ఆశ్చర్యపోయాను నేను. శలవలకి యింటికి వచ్చినప్పుడు మానాన్న నడిగేను.

'అదేమిటి నాన్నా అంత త్వరగా సంబంధం కుదిరిందీ ? ఇంతకీ వీళ్ళెవరూ, మనం ఎరిగున్నట్టులేదే ?'

'బాగా దూరపు సంబంధం – వియ్యంకుడికి బెంగుళూరులో ఏదో పనిట...' మా నాన్న మాట పూర్తవకుండానే అమ్మ అందుకుంది.

'తమ్ముడి పెత్తనం ఎప్పుడూ లేదు. చదువుకున్నవాడని మీ చిన్నబావకి పెద్ద స్వతంత్రమూలేదు. అంతా మా మరదలు పనే. ఎవరితో చెప్పాలేదు... చెయ్యాలేదు. తనే రైటు చేసేసింది.'

'పోనీ ఏదో ఒకటి...చిన్నబావకి పెళ్ళంటూ అవడం కావలసింది. ఇంతకీ కట్న మెంతో ?'

'కట్నం లేదుట !' అన్నారు మా నాన్న. నా ఆశ్చర్యాని కంతులేక పోయింది.

'అదేమిటీ?' అని అడిగేను నేను. మా అమ్మ జరిగిందంతా చెప్పింది. ముందుగా ఓనాడు పెళ్ళికూతురి తల్లి చక్కా వచ్చిందట. వస్తూనే ఓ నూరు రూపాయల పట్టుచీర తీసుకొచ్చి మా రంగమ్మత్త చేతిలో పెట్టి 'ముందుగా యిలా చెయ్యడం మా కలవాటు. మీరు పుచ్చుకోక తప్పదు' అని బలవంత పెట్టిందిట. ఆవిడ వచ్చిందగ్గర్నుంచీ 'ఇదేమిటీ' మీయింట్లో మంచి బీరువా అయినా లేదూ? పట్టుమని పది గాజుగ్లాసులైనా లేవేమిటీ? ఇంకా మీ రీ పూర్వకాలపు నేతచీర లేమిటీ? మీ కారు రిపేరులో ఉండడ మేమిటీ? అదేమిటి యింట్లో, హాల్లో ఓ 'ఊార్' లైటయినా లేదూ?' ఈవిధంగా మొదలెట్టిందిట. మా అత్త ఆ రాత్రివేళ పడకగది కురుక్షేత్రం చేసిందిట.

'చూశారా? ఘరానాగా ఆవిడ మాట లెలా ఉన్నాయ్, ఎంతపడితే అంత గణిస్తూ మీ బీదరుపు లెలా ఉన్నాయ్? ఉన్నన్నాళ్ళూ అనుభ వించాలిగాని కూడా పట్టుకపోతామా?'

ఆ మరునాడు కాబోయే వియ్యపురాల్ని బజారుకి వెంటబెట్టుకుని వెళ్ళి మా అత్త రంగనాయకులు బట్టలషాపులో నూరు రూపాయిలూ, సిటీ ఎంపోరియంలో ఏభై రూపాయిలు అరువుపెట్టి చక్కా వచ్చింది. ఈమాట విన్న మా మావ 'భార్యంటే యింత బరువుగా ఉంటుందా?' అని కొత్తగా విస్తుపోయాడట!

'జరిగింది చాలు! ఆవిడ్ని పంపెయ్యి' అన్నాడు మావ.

'చాల్చాలు. మనం చెయ్యలేకపోతే చూసైనా సంతోషించవద్దూ? అంత హుందా సంబంధాన్ని ఎలా వదలుకోగలమూ? ఒక్కర్తే ఆడపిల్లట. వీటన్నిటినీ మించి వాళ్ళకి...'

'ఎవరికీ'

'అదే — వియ్యాల వారికి. వారికి ఏముందో తెలిస్తే మీ రీ సంబంధాన్ని కాదనరు'

'ఏముందీ ?'

'మీలా కాదు ! ఉన్న యిల్లు రిపేరు చేయించడానికి మీరు ఖర్చుచేయ లేరు. ఏదికొన్నా సెకండు హేండు తప్ప కొనలేరు — వాళ్ళు అలాగా ! మనం తల్చుకోడానికేనా అనర్హులం ! మూడు మేడలున్నాయిట !—ఒకటీ రెండూ కాదు, నాలుగు కార్లుట !'

'అయితే మనకేం లాభం ?'

'అంతలోనే ఉంది తెలివి ! అన్ని పోషించడానికి ఎంత సంపాదన పరులై ఉండాలో ఆలోచించండి — ఒక్కగా నొక్కపిల్ల. ఇవన్నీ ఏంచేసు కుంటారూ ?'

మా మాంవ ఏదో అనబోయాడు. అత్త కస్సున లేచింది.

'ఇంత ఘరానాగా ఉన్నప్పుడు కట్నప్రసక్తి ఎత్తడం మన తెలివి తక్కువ — ఇష్టపడ్డామని ఉత్తరం రాయండి.'

మా మాంవ రాయలేదు. మా అత్తే రాయించింది. చాలా మంది భర్తలలాగే మా మాంవ ఉత్తరం రాశాడు. చిన్నబావ ఉత్తరం పోకుండా రిజిష్టరు చేశాడట !

*    *    *    *

మొత్తానికి పెళ్ళి అయిందనిపించారు. నాకు కనబడినంతవరకూ వియ్యాలవారింట్లో కర్రసామానూ, గాజు సామానూ ఎక్కువగానే ఉంది ! పెళ్ళికూతురు కూడా పొడుగ్గా, కర్రలా, గాజుబొమ్మలాగే ఉంది !

'అదేమిటమ్మా, పెళ్ళి ఒక మేడలో అయినా చేశారుకారు ?' అంది మా రంగమ్మత్త పెళ్ళిజరిగిన పెంకుటిల్లు చూసి ఉండబట్టలేక. దానికి ఏ కారణంచేతనో ఎవరూ జవాబు చెప్పలేదు. ఎవరివోగాని నాలుగయిదు కారులు మాత్రం ఆ పెళ్ళి ఒక్కరోజూ యిటూ అటూ తిరిగేయి.

వియ్యంకుడు ఒక్కరోజుపెళ్ళి అతి క్లుప్తంగా తెలివిగా జరిపించివేశాడు- ఆ తరవాత మూడురోజులుండి మా రంగమ్మత్తా, చిన్నబావా యిల్లు చేరుకున్నారు.

ఆ తరవాత ముఖ్యంగా చెప్పవలసిన సంగతి మా చిన్నబావ పెళ్లాం అత్తారింటికి రావడం సంగతి. ఆవేళ నేను అక్కడే ఉండడం తటస్థించింది. ఆ వయ్యారి ఓనాడు వేసవికాలం మధ్యాహ్నంవేళ పెట్టే బెడ్డింగూ కూలివాడిచేత పట్టించుకుని టకటక నడుచుకుంటూ అత్తారింటికి వచ్చేసింది!

మా రంగమ్మత్త ముక్కుమీద వేలేసుకుని—

'అదేమిటమ్మా, కావెళ్ళేవీ?' అని అడిగింది.

'కావెళ్ళేమిటీ?'

'అదేనమ్మా - సారెకావెళ్ళు!'

'మా వాళ్ళకి సారెపెట్టడం అలవాటులేదే!' అంది ఆ పిల్ల కోయిల కంఠంతో తిప్పుకుంటూ. ఇంకేం మాట్లాడుతుందీ వెర్రిరంగమ్మత్త?

'స్టేషను అంతదూరం గదా, నడిచేవస్తారా ఎండవేళ? ఓ టేక్సీ అయినా చేయించుకుని రాకపోయావా?'

'ఈమాత్రం దానికి కార్లెందుకండి?'

'మీ ఊళ్ళో యిలాగే చేసేదానివా?'

'మరి యింకెలాగ?'

'అయితే మీ కార్లన్నీ ఏమైనట్టు? నాలుగు కారులూ ఏం చేసుకునేవారు?'

'నాలుగు కార్లే! అసలు మాకు ఒక కారైనా లేదే!'

రంగమ్మత్త నోట మాటలేదు. ఎలాగో తెప్పిరిల్లి అడిగేసింది.

'మీకు మూడుమేడ లుండాలిట?'

'మూడుమేడలే? మూడు మేడలేఉంటే అద్దె యింట్లో బాధపడ్డం దేనికీ?' అంది ఆ అమ్మాయి ఆశ్చర్యపోతూ. మా అత్తకోపం ఆగలేదు.

మేం యివతలిగదిలో కేరమ్సు ఆడుతున్న వాళ్ళం అక్కడి కొచ్చేశాం. నడుముమీద చేతులెట్టుకుని అంచింది.

'మరి మీ అమ్మ అలా అందేం ?'

'దానికేముందండి, ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క అలవాటు. లేనిది ఉన్నట్టు చెప్పడం మా అమ్మ కలవాటు. ఉన్నది లేనట్టు చెప్పడం మా నాన్నకలవాటు. ఈ సంగతి ముందే తెలుసుకోకపోడం జరిగిన పొరపాటు. ఇంతకీ నాకు మా అమ్మ గుణాలేం రాలేదు. నావల్ల మీకు జరిగే హాని ఏమీ లేదు.'

మా అత్త పళ్ళు పటపట కొరికింది.

'నీ వల్ల నాకు జరిగే హాని లేకపోవచ్చు. కాని నావల్ల నీకు ముందు ముందు ఎంత హాని అయినా జరగవచ్చు, దీనివల్ల మీ అమ్మకి బుద్ధి రావచ్చు'. మా చిన్నబావ ఈ పరిస్థితుల్లో ఊరుకోలేదు.

'ఇంకా గుమ్మంలో అడుగు పెట్టిందోలేదో యీ అల్లరేమిటే అమ్మా? దాని మనసు ఎవ రే విధంగా నొప్పించినా నేను మాత్రం ఊరుకొనేదిలేదు సుమా ! పద, ఎప్పుడనగా భోంచేశావో.'

మా రంగమ్మత్త ఊరుకుందిగాని ఆ అమ్మాయి ఊరుకోలేదు !

'ఇంతకీ అత్తగారి అభిమానం, అమాయకత్వంగాని మా నాన్నకి ఒకవేళ మూడుమేడలూ నాలుగుకారులూ ఉంటే మాత్రం మీకేం లాభమండీ ? ఇంకోళ్ళ దగ్గిర పూచికపుల్ల పుచ్చుకోవలసిన అవసరం మీకేమిటీ? నాలుగుకాదు, నలభై కార్లు గుమ్మంలో తెచ్చిపెడితే మాత్రం మీరుగాని, అత్తగారుగాని వేలేస్తారా ? రేపొద్దుట పెద్ద ఉద్యోగం చేస్తే నాకు కావలసినది ఏదిపడితే అది మీరు కొనిపాెయ్యరూ ?'

'సెభాష్ కోడలా !' అందరం వెనక్కి తిరిగిచూశాం. మా మావ ! మా రంగమ్మత్త తప్ప అందరం నవ్వుకున్నాం !